ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755











దుండగులను చితకబాదుతున్న స్థానికులు

ఇంటి పైకప్పుపై దుండగుల తుపాకి, కత్తి - సుబ్రహ్మణ్యాన్ని కట్టేసిన స్థానికులు



పుష్పా స్టోర్ యజమాని భవనం వద్ద గుమికూడిన స్థానికులు



సంఘటనా స్థలంలో ఆక్టోపస్ బృందం

- తుపాకులతో బెదిరించి దోపిడీయత్నం
- డమ్మీవని తెలిసి తప్పించుకున్న వ్యాపారి
- అప్రమత్తమై దొంగల్ని పట్టుకున్న స్థానికులు
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పారిపోగా.. ఒకరు ములకలచెరువులో అరెస్టు

ఉలిక్కిపడ్డ చిత్తూరు





పోలీసులకు సాయం

గదులను తనిఖీ చేస్తున్న సీఐలు జయరామయ్య, నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం ఉలిక్కిపడింది.బుధవారం ఉదయం గాంధీ రోడ్డులో దోపిడీదొంగలు బీభత్సం సృష్టించారని తెలిసి ఆందోళనకు గురైంది.స్థానికుల చొరవతో వారు పట్టుబడ్డారని తెలిసి ఊపిరి పీల్చుకుంది.వివరాల్లోకి వెళితే.. చిత్తూరులోని గాంధీరోడ్డులో చంద్రశేఖర్ అనే వ్యక్తి పుష్ప కిడ్స్ వరల్డ్ షాపును నిర్వహిస్తున్నాడు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్స్‌లో షాపును నిర్వహిస్తుండగా.. సెకండ్ ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నాడు.ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కూడా ఆయన రాణిస్తున్నాడు. మరోవైపు చిత్తూరు కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎస్ఎల్‌వీ ఫర్నిచర్స్ యజమాని సుబ్రమణ్యం వ్యాపారంలో కుదేలైపోయాడు. మోసాలకు అలవాటు పడ్డ సుబ్రమణ్యం దోపిడీకి ప్రణాళిక రచించాడు. ఆర్థికంగా మంచి స్థాయిలో ఉన్నాడని భావించి పుష్ప కిడ్స్ వరల్డ్ యజమానిని దోచుకునేందుకు తనకు పరిచయమున్న వ్యక్తుల్ని అనంతపురం, నంద్యాల నుంచి మంగళవారం చిత్తూరుకు పిలిపించాడు. మూడు డమ్మీ తుపాకులు, 15 డమ్మీ బుల్లెట్లతో పాటు దోపిడీకి అవసరమైన గ్లౌజులు, మాస్కులు, కారం పొడి, నాలుగైదు కత్తులు కొనుగోలు చేశారు.చంద్రశేఖర్ ఇంట్లోకి ఎవరు ముందుగా వెళ్లాలి.. ఎవరు తుపాకులు పట్టుకోవాలి.. ఎవరు ఎలా బెదిరించాలి.. వంటివాటిపై చర్చించుకున్నారు.బుధవారం ఉదయం 6.20 గంటలకు ఓమ్నీ వ్యానులో సుబ్రమణ్యం మరో ఆరుగురితో కలిసి దుకాణం వద్దకు చేరుకున్నాడు.వారంతా నేరుగా చంద్రశేఖర్ నివాసం ఉంటున్న రెండో ఫ్లోర్‌లోకి వెళ్లారు.తుపాకులతో బెదిరించి డబ్బు, నగలు ఇవ్వాలన్నారు.ఇంతలో ఒకరు తుపాకీని కాల్చగా.. శబ్దాన్ని బట్టి అది డమ్మీ తుపాకీ అని గ్రహించిన చంద్రశేఖర్ వెంటనే మరో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని బిగ్గరగా కేకలు పెట్టడంతో బయట ఉన్న స్థానికులు అప్రమత్తమయ్యారు. ఆ ఏడుగురు లోపలికి వెళ్లే సమయంలోనే పక్కనే ఉన్న టీ షాపులోని ఉమాపతి సహా మరికొందరు వారిని అనుమానించారు. చంద్రశేఖర్ కేకలతో అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. 15-20 నిమిషాల వ్యవధిలోనే సుమారు 50-60 మంది స్థానికులు గుమికూడి దొంగలు పారిపోకుండా బిల్డింగ్‌ను చుట్టుముట్టారు. దొరికిపోయామని గ్రహించిన దొంగలు వెళ్లిన దారిలోనే వెనక్కి వస్తే జనాలు పట్టుకుంటారని భావించి పక్కనే ఉన్న పాత భవనంపైకి దూకేశారు. 15 అడుగుల ఎత్తు కావడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి.ఈలోపే బిల్డింగ్‌ను చుట్టుముట్టిన స్థానికులు దొంగలకు పారిపోయే అవకాశాన్నివ్వలేదు. పోలీసులు వచ్చేలోగా దొంగలు తప్పించుకోకుండా కాపుకాశారు. తరువాత కూడా దొంగల్ని పట్టుకోవడంలో పోలీసులకు సాయం చేశారు.నలుగురు దొంగల్ని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ముగ్గురు పారిపోయారు. వారిలో ఒకర్ని 11 గంటలకు ములకలచెరువు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు నిందితుల్ని టూటౌన్ పోలీసులు విచారిస్తుండగా.. సీఐ నెట్టికంఠయ్య కేసు నమోదు చేశారు.మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. మూడు తుపాకులు, 15 బుల్లెట్లు, నాలుగైదు చాకులు, గ్లౌజులు, మాస్కులు, కారం పొడి, ఓమ్నీ వ్యానులను సీజ్ చేశారు. కీలక నిందితుడు సుబ్రమణ్యం సహా వ్యాను నడిపిన సంపత్, నవీన్, రాజశేఖర్, ఇబ్రహీమ్‌లను విచారిస్తున్నారు. పారిపోయిన మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.



దుండగులను సాహసించి పట్టుకున్న యువకులు

- పెద్దఎత్తున మోహరించిన పోలీసులు

జిల్లా కేంద్రం కావడంతో సంఘటనా స్థలానికి ఎస్పీ మణికంఠ సహా ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున చేరుకున్నారు. దొంగల వద్ద తుపాకులు ఉన్నాయనే సమాచారంతో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, చేతిలో పిస్టల్స్ పట్టుకుని తనిఖీలు చేపట్టారు.ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఆపరేషన్ పూర్తయింది.నలుగుర్ని అదుపులోకి తీసుకున్న తరువాత ఇంకా ముగ్గురు లోపలే ఉన్నారనే అనుమానంతో తిరుపతి ఆక్టోపస్ యూనిట్ చిత్తూరుకు చేరుకుని రంగంలోకి దిగింది. 23 మంది సిబ్బంది భారీ ఆయుధాలతో పుష్ప స్టోర్ సహా చుట్టుపక్కల ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ మొత్తం సంఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నగరవాసులు ఉలిక్కిపడ్డారు. ఆ ప్రాంతాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని, చిత్తూరు నుంచి కాణిపాకం వెళ్లే రోడ్డుపై ట్రాఫిక్‌ను సైతం మళ్లించారు. ఏం జరుగుతుందో చూసేందుకు చాలామంది అక్కడికి చేరుకున్నారు.



దుండగులను వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు

అభినందించిన సీఎం చంద్రబాబు



కిడ్స్ వరల్డ్ అధినేత చంద్రశేఖర రెడ్డి

చిత్తూరులో దోపిడీ దొంగల ఘటనను బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించిన సీఎం చంద్రబాబు చిత్తూరు పోలీసులను అభినందించారు. 'చిత్తూరులో ఓ ఇంటికి వచ్చిన దొంగల ముఠాను రెండున్నర గంటల్లోనే పట్టుకున్న ఘనత చిత్తూరు పోలీసులకు దక్కింది. వారిని నేను అభినందిస్తున్నాను. ఇలాగే పని చేయాలని కోరుకుంటున్నా'అని సీఎం చెప్పడంతో సభలో సభ్యులంతా బల్లలను చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాన నిందితుడు సుబ్రమణ్యానిది నంద్యాల

నంద్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : చిత్తూరులో పట్టుబడ్డ దొంగలముఠాలో కీలక నేరస్తుడు సుబ్రమణ్యం అలియాస్ మాణ్యాలు నంద్యాలకు చెందిన వాడు. ఇతనితోపాటు నంద్యాలకు చెందిన నవీన్ అనే మరో దొంగ కూడా పోలీసులకు పట్టుబడ్డాడు.సుబ్రమణ్యం తొలుత ఓ రాజకీయ నాయకుడికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ చివరకు అతడినే 2005లో హత్య చేయించాడు.అప్పటి నుంచి సుబ్రమణ్యం అంటే జనంలో భయం ఏర్పడడంతో దాన్నే ఆసరాగా చేసుకొని వ్యాపారాల్లో దిగాడు. ఓ ఫర్నిచర్ దుకాణం నడిపాడు.రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. చివరకు రూ. కోట్లలో ఐపీ పెట్టి 2013 తర్వాత చిత్తూరుకు మకాం మార్చాడు.రూ.కోట్లలో అప్పులు చేసి తీర్చలేక దోపిడీకి యత్నించి దొరికిపోయాడు.



ప్రధాన నిందితుడు సుబ్రహ్మణ్యాన్ని కిందకు దించుతున్న స్థానికులు

ఆ దొంగలు అన్నదమ్ములు

అనంతపురం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో దోపిడీకి ప్రయత్నించిన దొంగల్లో అనంతపురం జిల్లావాసులు ముగ్గురు అన్నదమ్ములు కావడం విశేషం. వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం గ్రామానికి చెందిన దొమ్మర రామకృష్ణ కుమారులు రామాంజనేయులు, రాజశేఖర్, నెట్టికల్లు. ఏడేళ్ల క్రితమే తల్లిదండ్రులతో కలిసి అనంతపురం చేరారు. రామాంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్‌గా, రాజశేఖర్, నెట్టికల్లు అనంతపురం మార్కెట్‌యార్డులోని కూరగాయల మార్కెట్‌లో కూలి పనులు చేస్తుంటారు.



ర్యాలీగా వస్తున్న వైసీపీ నాయకులు

ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

- కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా

చిత్తూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. యువత పోరు నినాదంతో బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు మంజూరు చేయాల్సిన ఫీజును చెల్లించలేదన్నారు.ఫీజు బకాయిలను విడుదల చేసేంతవరకూ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు లలితకుమారి, సునీల్‌కుమార్, వెంకటే గౌడ, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ బడ్జెట్‌కు ఆమోదం

చిత్తూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 2024-25వ సంవత్సరానికి జడ్పీ బడ్జెట్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు పంపిన రివైజ్ బడ్జెట్(ఆదాయం రూ.4,133 కోట్లు, వ్యయం రూ.4099 కోట్లు)కు అంగీకారం తెలిపింది.

CHITTOOR MUNICIPAL CORPORATION

Roc.No:1099/2024/TO Dated :12-03-2025

E-Procurement Short Tender Notice

Tenders are invited from eligibile contractors for **07 works** under General Funds from **Rs.8.96 Lakhs to 9.98 Lakhs** through e-procurement by under signed.

Sl.No	Bid down loading starting date and time	Last date & time for receipt of Bids
1 to 7	13-03-2025 @ 4.00 PM	21-03-2025 @ 4.00 PM

Further details contact at **9849907886** during the office hours on all working days.

Sd/- P.Narasimha Prasad, Commissioner, Chittoor Municipal Corporation

కుప్పంలో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ఏర్పాటుకు రూ.5.34 కోట్లు మంజూరు

కుప్పం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ఏర్పాటుకు రూ.5.34 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోగ్య అధికారులు, ప్రాజెక్టు మేనేజర్లు, రోగి సంరక్షణ, సమన్వయకర్తలు, సాంకేతిక ఆధారిత నిపుణులతో కూడిన ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా ప్రజారోగ్య అంశాలకు సంబంధించిన అన్ని విషయాలను ఈ సెంటర్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుంది.

రేణిగుంట - అరక్కోణం సెక్షన్‌లో లెవల్ క్రాసింగ్‌ల మూసివేత

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా జిల్లాలో రేణిగుంట-అరక్కోణం సెక్షన్ పరిధిలో గల లెవల్ క్రాసింగ్‌లను మూసివేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.నగరి-వేపగుంట, వేపగుంట యార్డు, వేపగుంట-పుత్తూరు, తడుకు యార్డులో గల లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటులో భాగంగా రైల్వే ఉన్నతాధికారులు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.ఈ పనుల కారణంగా లెవెల్ క్రాసింగ్‌లను మూసివేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు రూ. 8 కోట్లు

- అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలకు సర్కారు తోడు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా రూ. 50వేల నుంచి రూ. లక్ష వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గృహ నిర్మాణం, రెవెన్యూ సమస్యల పరిష్కారం, కుప్పం నియోజకవర్గ అభివృద్ధి, తాగునీటి ఎద్దడి అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నిధుల్లేక అర్ధంతరంగా నిలిపేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు 17, 800 మంది వున్నట్లు గుర్తించామన్నారు. వీరికి ప్రభుత్వం తరపున చేయూతనిస్తామని ప్రకటించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సర్వే చేపడుతున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే వస్తున్నాయని చెప్పారు. ఇటీవల రీ సర్వే, రెవెన్యూ సమస్యలపై సదస్సులు నిర్వహించగా భూ సమస్యలు, మ్యుటేషన్, సర్వే నెంబర్ల సమస్యలపై దాదాపు 10వేల అర్జీలు అందాయన్నారు. వీటిలో ఇప్పటి వరకు 1500 పరిష్కరించామన్నారు. వెబ్ ల్యాండ్ సమస్యల పరిష్కారానికి జేసీ స్వయంగా ఆర్డీవో కార్యాలయాలకు వెళతారన్నారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 55వేల ఫిర్యాదులందగా రానున్న ఆరు నెలల్లో 4వేల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో 13 పీహెచ్‌సీలుండగా వైద్యనిపుణులతో టెలీ కన్సల్టెన్సీ, ఆన్‌లైన్ రికార్డుల నిర్వహణ, రెఫరల్ విధానం, కాల్‌సెంటర్ ఏర్పాటు కోసం కొత్తయాప్‌ను తయారు చేస్తున్నామన్నారు.కుప్పంలో ఉన్న 250 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 21వేల మంది చిన్నారులున్నారని, వీరికి శిక్షణ కోసం రూ. 2.90 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. జిల్లాలో తాగునీటి నివారణ కోసం రూ. 8 కోట్ల జడ్పీ నిధులను విడుదల చేసి నీటి బోర్ల మరమ్మతులు, పంపుసెట్ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్లను అందిస్తున్నామన్నారు. చిత్తూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో తప్ప మిగిలిన వాటిలో సమస్యలు రాలేదన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.28

సహరి (శుక్రవారం) : 5.02

బహిరంగ ప్రకటన

ICICI Bank

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా ... 24, 2025న ఇ-వేలం ... https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. ...

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
[illegible]	[illegible]

సం/- అధీకృత అధికారి, ఐసీఐసీఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున



అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బెంగళూరుకు చెందిన మహాలక్ష్మి బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును శ్రీవారి ఆలయం ముందు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీఈవో లోకనాథంకు దాత అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జస్టిస్ మాల



జస్టిస్ పీబీ భజంత్రీ



నిమ్మగడ్డ రమేష్‌కుమార్



శోభా చంద్రశేఖర్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మాల, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ భజంత్రీ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తమిళ సినీ హీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.



సోమవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,393

తలనీలాలు సమర్పించినవారు: 19,490

● నేడు వరల్డ్ కిడ్నీ డే



కిడ్నీ..శరీరంలో కీలకభూమిక పోషించే అవయవం. రెండు కిడ్నీలు శరీరంలోని వ్యర్థాలను శుభ్రం చేస్తూ మంచి రక్తాన్ని సరఫరా చేస్తాయి. ఈ అవయవాల్లో ఏర్పడే చిన్నపాటి రాళ్లను ఆరంభంలోనే గుర్తించి తొలగించకపోతే తీవ్ర అనారోగ్యం కలగజేస్తాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. ఈనేపథ్యంలోనే కిడ్నీవ్యాధిగ్రస్థులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులకు ఆరోగ్య భరోసా ఇస్తోంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి



డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ బాధితులు

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ అండ
- 1440 మందికి డయాలసిస్ సేవలు
- క్రమం తప్పకుండా నెల వారీ పింఛను

బాధితులకు 'దయా'లసిస్



జిల్లాలో 1440 మంది వరకు కిడ్నీ వ్యాధిబారిన పడి ప్రభుత్వ సాయంతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరికోసం ప్రభుత్వం నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నాలుగు డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది. తిరుపతి స్విమ్స్‌లో అతి పెద్ద కేంద్రం పనిచేస్తోంది. నెలలో ఇక్కడ 870 మంది డయాలసిస్ సేవలు పొందుతున్నారు. రుయాలో 119, శ్రీకాళహస్తిలో 40, నగరిలో 25 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ ఈ సేవలను అందిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో హయాంలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం కొవిడ్‌ను సాకుగా చూపి కిడ్నీ బాధితులకు 108 వాహనం ద్వారా కల్పించాల్సిన ఉచిత రవాణాకు స్వస్తి పలికింది. నెలకు ఇవ్వాల్సిన రూ.10 వేల పింఛను కూడా అరకొరగానే అందించింది. దూర ప్రాంతాల నుంచి డయాలసిస్ కోసం వచ్చే వారికి ఈ మొత్తం రవాణా ఖర్చులకు కూడా సరిపోయేది కాదు. పింఛను అందక డయాలసిస్ కూడా చేయించుకునేందుకు రవాణా ఖర్చులు లేక కొందరు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. దీనికితోడు డయాలసిస్ కేంద్రాల్లో మందుల కొరత, వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉండేది. ఏడాది కిందట బాధితులు స్విమ్స్ వద్ద దీనిపై ఆందోళనకు కూడా దిగాల్సివచ్చింది..

కూటమి సారథ్యంలో మెరుగైన సేవలు

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యభద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కిడ్నీ వ్యాధి బాధితులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదని గుర్తించింది. ప్రతినెలా నిర్దేశిత సమయానికి అందించేలా చర్యలు తీసుకుంది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఫలితంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా నిరుపేదలైన బాధితులకు రూ.10 వేల పింఛను అందజేస్తోంది. డయాలసిస్‌కు వచ్చి వెళ్లేందుకు 108 వాహన సదుపాయాన్ని కూడా కల్పించింది.

క్రమం తప్పకుండా ఇస్తున్నారు.

డయాలసిస్ అవసరమైనప్పటి నుంచి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను. గడిచిన మూడేళ్లలో డయాలసిస్ కోసం వెళ్లడానికి కూడా డబ్బులుండేవి కావు. కూటమి ప్రభుత్వం వచ్చాక పద్ధతిగా పింఛను ఇస్తున్నారు. ఉద్యోగుల జీతాల కంటే ముందుగానే మాలాంటి వాళ్లకు నెలకు రూ.10వేలు ఇస్తున్నారు.

- మునస్వామి, కేబీఆర్‌పురం

ఏడాది క్రితం ఎన్ని కష్టాలో..

ఏడాది కిందట పింఛను కోసం నానా అగచాట్లు పడ్డాను. అధికారుల చుట్టు తిరిగినా నెలలు తరబడి ఇవ్వలేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నాలుగు నెలలుగా క్రమం తప్పకుండా పింఛను అందుతోంది. ఇప్పుడు బాగానే ఉంది.

- వెంకటేష్, వరదయ్యపాళెం





పింఛనే బతుకు మార్గమైంది..

గతంలో పింఛను సక్రమంగా అందక చాలా ఇబ్బందులు పడేదాన్ని. మందులు కొనుక్కోడానికి చేతిలో డబ్బులు లేక నరకం అనుభవించాను. ప్రస్తుతం ఆ సమస్య లేదు. ప్రతి నెలా రూ.10 వేల పింఛను అందుతోంది. ఆ మొత్తం మందులకే కాదు జీవనోపాధికి కూడా తోడ్పడుతోంది

- శకుంతల, మంగళం(తిరుపతి)



- ఆకట్టుకున్న 'విరించి-2కె25' ప్రదర్శనలు
- పద్మావతి వర్సిటీలో వేడుకలు ప్రారంభం

సాంస్కృతికోత్సాహం









తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బుధవారం సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికైంది. సంగీత సాహిత్య సమలంకృతే.. స్వర రాగ పదయోగ సమ భూషితే.. అంటూ రెండు రోజుల పాటు విరించి-2కె25 పేరిట జరిగే కళావేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని, కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. క్రీడా, సాంస్కృతిక అంశాల ద్వారా సృజనాత్మకత, మానసిక వికాసం ఏర్పడతాయన్నారు. యూనివర్సిటీలో సంగీత, సాహిత్యాల్లో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్వితీయమైన కృషి సాగిందన్నారు. ఇటీవల నోయిడాలోని అమెటి యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని గుర్తుచేశారు. అనంతరం నిర్వహించిన వివిధ సంగీత, నృత్య ప్రతిభా పోటీలు ఆకట్టుకున్నాయి. ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మిస్ విరించిగా హీనా సయ్యద్

విరించిలో భాగంగా ఫ్యాషన్ షో నిర్వహించారు. లా డిపార్ట్‌మెంట్‌కు చెందిన హీనా సయ్యద్ మొదటి స్థానంలో నిలిచి మిస్ విరించిగా ఎంపికయ్యారు. ఎల్ఎల్‌బీ విద్యార్థిని నాగభవానీ ద్వితీయ, సీఎస్ఈ విద్యార్థిని ఎస్.మనస్విని మూడవ స్థానంలో నిలిచారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నాయుడుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ప్రభాకర్‌ను హనీట్రాప్ అంశంపై సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ దళిత విద్యార్థినిపై హనీట్రాప్ జరిగిందన్న అభియోగంపై గూడూరు డీవైఈవో, విచారణ అధికారి సనత్‌కుమార్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మామండూరులో ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి



ఆకాష్ మృతదేహం

రేణిగుంట, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరులో ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుపతిలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న 10 మంది విద్యార్థులు మామండూరుకు వెళ్లారు. ఇక్కడ అటవీ సిబ్బంది దగ్గర టిక్కెట్లు కొని గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత నీటిలో ఈత కొడుతుండగా ఆకాష్ (20) మునిగిపోయాడు. సహచరులు అతడిని వెలికితీసి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థిని రుయాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయం రద్దు

- శాసన మండలిలో మంత్రి నారాయణ ప్రకటన
- విద్యార్థి సంఘాల హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్వీయూ విద్యార్థులు.. పూర్వ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు.. ఇప్పుడు ఫలితం లభించింది. ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు బుధవారం శాసన మండలిలో మంత్రి నారాయణ ప్రకటించారు. దీనిపై విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. చంద్రగిరి- తిరుపతి రోడ్డుకు, అలిపిరి- జూపార్క్‌ను కలిపే మూడు రోడ్లను రూ. 4 కోట్లకు పైగా ఎస్వీ యూనివర్సిటీ లోపలి నుంచే వేయాలని గతంలో నిర్ణయించారు. జూపార్క్ సమీపంలో గల ఒబెరాయ్ హోటల్‌ను అనుసంధానించడానికే ఈ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారంటూ అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎస్వీయూనివర్సిటీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా మాస్టర్ ప్లాన్ రోడ్లను వ్యతిరేకించారు. అనేక విద్యార్థి సంఘాలు ఒక్కటిగా యూనివర్సిటీ వేదికగా పటిష్ఠ ఉద్యమాన్ని చేపట్టారు. అయినా, అప్పట్లో ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించలేదు. ఆ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ క్రమంలో యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం మంచి పరిణామమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికీ, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుచానూరులో ఐజీఎన్‌సీఏ ప్రాంతీయ కేంద్రం



ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ సచ్చిదానందజోషి, డైరెక్టర్ ప్రియాంకమిశ్రా, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, పులివర్తి సుధారెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అపురూపమైన భారతీయ కళా వారసత్వాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సహకారంతో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) ద్వారా తిరుచానూరులో బుధవారం 10వ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించారు. సంస్కృత వర్సిటీకి మాజీ స్పీకర్ దివంగత మాడభూషి అనంతశయనం అయ్యంగార్ గతంలో ఇచ్చిన భవనంలో దీనిని నిర్వహించనున్నారు. కేంద్రాన్ని ఐజీఎన్‌సీఏ మెంబర్ సెక్రటరీ డాక్టర్ సచ్చిదానందజోషి, డైరెక్టర్ ప్రియాంకమిశ్రా, సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, పులివర్తి సుధారెడ్డి ప్రారంభించారు. వైష్ణవ ఆగమాలు, శిల్ప కళల్ని ప్రోత్సహించి ఆధునిక తరానికి అందించాలని సంకల్పించడం గొప్ప విషయమన్నారు.. కాశీ నుంచీ తెచ్చిన అగస్త్య మహర్షి ప్రతిమను ఈ సందర్భంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో పద్మ సుబ్రమణ్యం, ఢిల్లీకి చెందిన విద్యావేత్త మాళవికాజోషి, పాండిచ్చేరి రీజినల్ సెంటర్ డైరెక్టర్ రాఘవన్, అసిస్టెంట్ డైరెక్టర్ అనితాసూరి, ప్రొఫెసర్ సుమిత్, సంస్కృత వర్సిటీ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు కనపాల కుమార్, పీఆర్వో రమేష్‌బాబు పాల్గొన్నారు.

'ఫిట్‌లెస్' వాహనాలు!

- పలు ప్రైవేటు బస్సుల పరిస్థితి ఇదీ
- చోద్యం చూస్తున్న అధికారులు

తడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రవాణాకు ఉపయోగించే బస్సుల్లో చాలావరకు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ ఉండటం లేదు. అవి ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా ఆగిపోతాయో, ప్రమాదాల బారిన పడతాయో తెలియని పరిస్థితి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. పారిశ్రామికంగా సూళ్లూరుపేట నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది. నాయుడుపేట మండలం మేనకూరు.. తడ మండలం మాంబట్టుతోపాటు సత్యవేడు నియోజకవర్గ పరిధిలో శ్రీసిటీ సెజ్‌లు ఉన్నాయి. 250కు పైగా పరిశ్రమలు ఏర్పాటు కావడం, సుమారు లక్ష మంది వరకు ఉద్యోగులు, కార్మికులు ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వీరికోసం ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసుకున్నారు. 500కు పైగా బస్సులు ఆయా ఉద్యోగులను, కార్మికులను పరిశ్రమలకు చేర్చేపనిలో ఉన్నాయి. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల కోసం బస్సులను ఏర్పాటు చేశాయి. ఇవి కూడా సుమారు వంద వరకు ఉన్నాయి. ఇలా జనాన్ని తీసుకెళ్లే ఈ ప్రైవేటు బస్సులు.. ఫిట్‌నెస్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. కాలంచెల్లిన బస్సులకు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొంది వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవంగా విద్యార్థులను తరలించే బస్సులు 15 ఏళ్ల తరువాత వినియోగించరాదు. కిటికీలకు ప్రత్యేక గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ఇలా భద్రతాపరమైన చర్యలతో పాటు సరైన సమయానికి మరమ్మతులు చేయిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పొందాలి. ఇంత తతంగాన్ని ఆయా బస్సుల యజమానులు చేయకనే సంబంధిత రవాణాశాఖ అధికారులను మభ్యపెట్టి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని బస్సులు ప్రమాదాల బారిన పడటం లేదా ఎక్కడ పడితే అక్కడ ఆగిపోవడంతో ఈ విమర్శలకు బలమిస్తున్నాయి. గత నెల 21న ఓ స్కూల్ బస్సు బోల్తా పడగా.. ఇటీవల ఓ పరిశ్రమకు చెందిన బస్సు కార్మికులను తీసుకువెళ్తూ వరదయపాళెం మండలం సామంతమల్లాం సమీపంలో బోల్తా కొట్టింది. ఈ రెండు ఘటనల్లో చిన్నపాటి గాయాలతోనే బయటపడ్డారు. భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలు జరగకుండా రవాణాశాఖ అధికారులు బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టి.. కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



బోల్తా పడ్డ పాఠశాల బస్సు (ఫైల్ ఫొటో)



రోడ్డుపై బస్సుకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

స్టీరింగ్ రాడ్ విడిపోయి ఆగిన బడి బస్సు

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని సంఘం థియేటర్ సెంటర్ కూడలి వద్ద బుధవారం ఓ ప్రైవేటు పాఠశాల బస్సు వెళుతుండగా స్టీరింగ్ రాడ్ విడిపోయింది. దీంతో అతికష్టం మీద బస్సును డ్రైవరు నిలిపేశారు. దీంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో.. తక్కువ వేగంతో వెళ్తుండటం వల్ల సరిపోయింది కానీ.. అదే, శివారు ప్రాంతాల్లో వేగంగా వెళ్తుంటే మాత్రం ప్రమాదం తీవ్రంగా ఉండేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బస్సుల కండిషన్ విషయంలో రవాణాశాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులిస్తే ఇలాంటివి చోటు చేసుకోవని స్థానికులు అంటున్నారు.

కిడ్నీలపై అవగాహన అవసరం

శరీరంలో వ్యర్థాలను వడపోసే కీలకమైన అవయవం మూత్రపిండాలు.వీటి పనితీరు ఆధారంగానే మిగిలిన అవయవాలు సమర్థంగా పనిచేస్తాయి. కిడ్నీలు ఒకసారి దెబ్బతింటే తిరిగి బాగు చేయటం సాధ్యం కాదు.అయితే కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పాడవకుండా చూసుకోవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అవగాహన లేమి, నిర్లక్ష్యం వల్ల మన జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఏటా పెరుగుతున్నారు. జిల్లాలో కిడ్నీవ్యాధిపై అవగాహన లేక క్రమంగా బాధితులు సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు జిల్లాలో నెఫ్రాలజిస్టులు లేకపోవడంతో బాధితులు వ్యయప్రయాసలతో పక్క జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

- పెరిగిపోతున్న డయాలసిస్ బాధితులు
- అవయవదానంపై చైతన్యం పెరగాలి

పరిస్థితి చేయిదాటిన తరువాతే....

కిడ్నీ సంబంధ సమస్యలతో జిల్లాలో చికిత్స తీసుకునే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. జిల్లాలో ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులు పరిస్థితి చేయిదాటిన తర్వాత వస్తున్నారు. ఫలితంగా డయాలసిస్, కిడ్నీ మార్పిడి చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమస్యలను ముందుగానే గుర్తిస్తే నివారణ సులభమంటున్నారు వైద్యులు. డయాలసిస్ ప్రక్రియ చిత్తూరు ప్రభుత్వాస్పత్రితో పాటు బంగారుపాళ్యం, కుప్పం, నగరి ఏరియా ఆస్పత్రుల్లో అందుబాటులో వుంది.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

రక్తసంబంధీకులే....దేవుళ్లు

కిడ్నీలు విఫలమైన వారిలో పలువురికి మార్పిడి చేయాల్సి వస్తుంది. సమస్యను తొలిదశలో గుర్తించకపోవడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అటువంటి వారికి అవయవ మార్పిడే ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. ఆ సమయంలో బాధితుల రక్తసంబంధీకులే ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఎక్కువగా రోగుల తల్లి, తండ్రి, తోబుట్టువులు కిడ్నీ ఇచ్చి పునర్జన్మ అందిస్తున్నారు. అంతే కాకుండా జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే వారికి సరిపోయే కిడ్నీలు అందుబాటులోకి వచ్చినప్పుడు మార్పిడికి అవకాశం ఉంటుంది. దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో ఎంతోమంది కిడ్నీ మార్పిడి కోసం నిరీక్షిస్తూ... మరణిస్తున్నారు.

759 మందికి పింఛన్లు

డయాలసిస్ చేయించుకునే వారి సంఖ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 759కి చేరింది. ఇలా చేయించుకునే వారికి అర్హతను బట్టి రూ.10 వేల నుంచి బెడ్‌రెస్ట్‌లో ఉన్న వారికి రూ.15వేలు అందజేస్తున్నారు. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం తీవ్ర కిడ్నీ సమస్యలతో బెడ్‌రెస్ట్‌లో ఉన్నవారు 165 మంది ఉండగా వీరికి రూ.15 వేలు, ఇంట్లో నుంచి డయాలసిస్ చేయించుకుంటున్న వారు 594మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రిలో 231, ప్రైవేటు ఆస్పత్రుల్లో 363 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరందరూ రూ.10 వేలు పింఛను అందుకుంటున్నారు.

నేడు వరల్డ్ కిడ్నీ డే



అవగాహనతోనే వ్యాధికి దూరం

గుండెపోటు, రక్తపోటు, మధుమేహం తర్వాత మూత్రపిండాల సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్య రుగ్మతలు కిడ్నీ వ్యాధులకు కారణం. గ్రామీణ ప్రాంతాల్లో నీటి కాలుష్యం కారణంగా మూత్రపిండాల సమస్యలు తలెత్తుతున్నాయి. కిడ్నీ వ్యాధిగ్రస్తులు విధిగా వ్యాయామం చేయాలి. మద్యపాన, ధూమపానం, మాంసాహారం మనేయాలి. పౌష్టికాహారం తీసుకోవాలి, మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి.

- ప్రభావతి, డీసీహెచ్ఎస్, చిత్తూరు



పెయిన్ కిల్లర్స్‌కు దూరంగా ఉండాలి

వయసుతో సంబంధం లేకుండా మూత్రపిండాల జబ్బు బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా గతంలో కొవిడ్ సోకిన వారిలో ఈ సంఖ్య అధికంగా ఉంటోంది. మధుమేహం, రక్తపోటు నియంత్రణ లేకపోవడం, గ్యాస్ట్రిక్, పెయిన్ కిల్లర్స్ మందులు ఎక్కువగా తీసుకోవడం, కలుషిత నీరు తాగడం, తగినంత నీరు తీసుకోకపోవడం, ధూమపానం, మద్యం అలవాట్లు ఇందుకు ప్రధాన కారణం. మూత్రంలో ప్రొటీన్ ఎక్కువగా బయటకు పోవడం వల్ల కిడ్నీ జబ్బులు అధికంగా నమోదవుతున్నాయి. అధిక బరువున్న వారు మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. నిత్యం గంటపాటు నడకతో పాటు వ్యాయామం చేయాలి. పెయిన్ కిల్లర్స్‌కు దూరంగా ఉండాలి.

-డాక్టర్ అరుణకుమార్, సూపరింటెండెంట్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి

తరచూ పరీక్షలతో అడ్డుకట్ట

డెంగీ, మలేరియా, డయేరియా, ఫుడ్‌పాయిజనింగ్ తదితర ఇన్‌ఫెక్షన్లు ఆకస్మిక కిడ్నీ వైఫల్యానికి దారితీస్తాయి. పాముకాటు వల్ల ఎక్కువమందిలో కిడ్నీలు దెబ్బతింటున్నాయి. మహిళల్లో ఇన్‌ఫెక్షన్లు కిడ్నీ వైఫల్యానికి కారణమవుతున్నాయి. గర్భిణుల్లో డెలివరీ సమయంలో అధిక రక్తస్రావం ఇతర ఇన్‌ఫెక్షన్లు కూడా కిడ్నీ వైఫల్యానికి దోహదం చేస్తాయి. ప్రతి 100 డెలివరీల్లో ఏడుగురికి కిడ్నీ సమస్యలు ఎదురవుతున్నాయి. గర్భిణుల్లో డీహైడ్రేషన్ రాకుండా చూసుకోవాల్సి ఉంటుంది.ఎలాంటి లక్షణాలు లేకపోవడం వల్ల వైద్యులను సంప్రదించడంలో ఆలస్యమవుతుండడం కూడా కిడ్నీ ఫెయిల్యూర్స్‌కు కారణం. తరచూ కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



కుప్పంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయండి



రాష్ట్రంలో మారుమూల ప్రాంతమైన కుప్పంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయండి.కడప, శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు ప్రాంతాల్లో వున్న ట్రిపుల్ ఐటీలు చిత్తూరు జిల్లాలో లేకపోవడం మారుమూల ప్రాంత విద్యార్థులకు వెలితిగా ఉంది. కుప్పంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేస్తే చిత్తూరు, అన్నమయ్య జిల్లాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. కుప్పంలోని ద్రావిడ వర్సిటీలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు అనువైన స్థలం సిద్ధంగా ఉంది.

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ఏనుగుల బెడద అరికట్టండి



పూతలపట్టు నియోజకవర్గంలో ఏనుగుల బెడద పెరిగింది.పంట పొలాలను నాశనం చేయడమే కాకుండా రైతులపై దాడులు చేయడంతో చాలా మంది గాయాలపాలయ్యారు. కొందరు రైతులు ప్రాణాలు కూడా పోగొట్టుకున్న దురదృష్టకరమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఏనుగుల దాడి నుంచి రైతులను, పంటలను రక్షించేందుకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కంచెను ఏర్పాటు చేయాలి.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

వెబ్‌ల్యాండ్ దిద్దుబాట్లపై దృష్టి పెట్టండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వెబ్‌ల్యాండ్ దిద్దుబాట్లపై దృష్టిపెట్టాలని, నాణ్యతతో వాటిని పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీతో కలిసి సర్వేశాఖ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరు లోగా క్షేత్రస్థాయిలో అనుభవంలోవున్న రైతుల వివరాలు, సంబంధిత రికార్డుల్లో వున్న వివరాలను పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే వెబ్‌ల్యాండ్ దిద్దుబాట్లను పూర్తిచేయాలన్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు పారదర్శకంగా పనిచేస్తూ, సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారం వారం వచ్చే అర్జీల్లో దాదాపు 80 శాతం రెవెన్యూకు సంబంధించినవే ఉంటుండగా, అందులో సర్వేశాఖకు సంబంధించిన అర్జీలే అత్యధికంగా ఉంటున్నాయని తెలిపారు. నోషనల్ ఖాతా రెగ్యులరైజేషన్, మ్యూటేషన్ సంబంధిత సర్వే అంశాలను మండలాల వారీగా కలెక్టర్, జేసీ సమీక్షించారు. ఈ సమావేశంలో సర్వేశాఖ ఏడీ జయరాజ్, జిల్లా నోడల్ ఆఫీసర్ గణేష్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఫ్రంటియర్ మార్కెట్స్‌తో కడా ఒప్పందం



కుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇకపై డిజిటల్‌గా మారనుందని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. ఆయన బుధవారం కడా తరఫున ఫ్రంటియర్ మార్కెట్స్ కన్సల్టింగ్ ఏజన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ ఏజన్సీ ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు డిజిటల్ లావాదేవీలు, డిజిటల్ ఆన్‌లైన్ మార్కెటింగ్, ఆర్థిక లావాదేవీలపై జూన్ నుంచి రెండు నెలల శిక్షణ ఇస్తామన్నారు.ఈ ప్రయోగం సక్సెస్ అయితే తర్వాత జిల్లాలో, ఆ తర్వాత మొత్తం రాష్ట్రంలో అమలయ్యే అవకాశం ఉందన్నారు. ఫ్రంటియర్ సీఈవో అండ్ ఫౌండర్ అజైతా షా మాట్లాడుతూ రాజస్థాన్, బాంబే, ఢిల్లీ ప్రాంతాలలో 1800 డిజిటల్ బేస్డ్ షాపులను నడుపుతున్నట్టు చెప్పారు. ఈ దుకాణాలలో విత్తనాల నుంచి డిజిటల్ వస్తువులదాకా విక్రయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇచ్చి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడం తమ ఏజెన్సీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.టీడీపీ నాయకుడు డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల సాధికారతకు తీసుకుంటున్న గొప్ప చర్యగా ఈ ఎంఓయూను అభివర్ణించారు.

ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

- కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రసాయనాల ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఫ్యాక్టరీల్లో ఆకస్మికంగా జరిగే ప్రమాదాల సంక్షోభ నివారణ చర్యలపై సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ అకస్మాత్తుగా ఫ్యాక్టరీల్లో జరిగే ప్రమాదాల సమయంలో అపాయం నుంచి తప్పించుకునే మార్గం, ప్రమాదాలనివారణపై అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రతి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఫ్యాక్టరీల్లో సంబంధిత అధికారుల సమక్షంలో మాక్‌డ్రిక్ నిర్వహించాలని చెప్పారు.మూడునెలలకోసారి భద్రతా ప్రమాణాలపై తీసుకున్న చర్యల గురించి నివేదికలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరిశీలించాలని ఆదేశించారు.జిల్లాలోని 10 మండలాల పరిధిలో 111 కి.మీ. నిడివి గల చెన్నై-బెంగళూరు ఐవోసీఎల్ పైప్‌లైన్, 107.22 కి.మీ. నిడివి గల విజయవాడ-ధర్మపురి హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పైప్‌లైన్ ఉందని చెప్పారు. జిల్లా పరిధిలో ప్రమాదకర రసాయనాల రవాణా జరుగుతుంటాయని వివరించారు. చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ వెంకటరెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, ఐవోసీ, ఇతర ఆయిల్ కార్పొరేషన్ల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

భక్తురాలికి పోగొట్టుకున్న బ్రాస్‌లెట్ అప్పగింత

ఐరాల(కాణిపాకం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వినాయక స్వామి దర్శనానికి విచ్చేసిన ఓ భక్తురాలు తన 14 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్‌ను బుధవారం పోగొట్టుకుంది. ప్రధాన ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అటెండర్ వీరమునికి దొరకడంతో హోమ్‌గార్డు హెడ్ వినాయకంతో కలసి ఏఈవో రవీంద్రబాబుకు అప్పగించారు. అనంతరం ఈ విషయంపై ఆలయ అనౌన్స్‌మెంట్‌లో తెలియజేశారు. బంగారుపాళ్యం మండలం నల్లంగాడుకు చెందిన కీర్తన తన చేతిలో ఉండవలసిన బ్రాస్‌లెట్ కనపడకపోవడంతో ఏఈవోను కలసి... అది తనదేనంటూ తన చేతికున్న ఫొటోను ఫోన్‌లో చూపించారు. అది ఆమెదేనని నిర్ధారించుకున్న అనంతరం కీర్తనకు బ్రాస్‌లెట్‌ను అందించారు.

తాళపత్రాలు తరిగిపోని సంపద



ఎమినో భవనం వద్ద తాళపత్రాలను పరిశీలిస్తున్న ఆచార్యులు, పరిశోధకులు

గుడుపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):తరిగిపోని వారసత్వ సంపద అయిన తాళపత్రాలను సేకరించి భద్రపరచాల్సి వుందని ఆచార్య జయధీర్ తిరుమల రావు పేర్కొన్నారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయంలో జానపద విజ్ఞాన గిరిజన అధ్యయన శాఖ, ఢిల్లీలోని నేషనల్ మిషన్ మాన్యుస్క్రిప్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పురాతన రాతప్రతుల ప్రాముఖ్యత అవగాహన సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతరించిపోతున్న ప్రాచీన సంస్కృతిని పరిరక్షించుకోవాలంటే తాళపత్రాలను అధ్యయనం చేయాలన్నారు. ఇప్పటివరకు లభించిన మాన్యుస్క్రిప్టులు 2,60,000 వున్నాయని,వాటిలో తెలుగు దాదాపు 200వున్నాయన్నారు.ద్రావిడ వర్సిటీ వీసీ దొరస్వామి మాట్లాడుతూ ప్రాచీన మాన్యుస్క్రిప్టులను సేకరించి, వాటి పై పరిశోధనలు జరపవలసిన అవసరం ఉందన్నారు. కన్నడ,పాండిచ్చేరి విశ్వవిద్యాలయాల ఆచార్యులు బోరులింగయ్య ,చల్ల పెరుమాల్ ,గుడూరు మనోజ,రిజిస్ట్రార్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్న ఈ సదస్సుకు ఆచార్య శ్యామల సంచాలకులుగా వ్యవహరించారు.



ఢిల్లీలోని పార్లమెంట్ సమావేశ మందిరంలో బుధవారం మడగాస్కర్ దేశ అసెంబ్లీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఏఎస్ఐ మృతి



గురుస్వామి (ఫైల్ ఫొటో)

వడమాలపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని వడమాలపేట ఏఎస్ఐ వై.గురుస్వామి(60) బుధవారం అప్పలాయగుంట వద్ద వస్తుండగా కింద పడి మృతి చెందారు. ఓ కార్యానికి వెళ్లిన ఆయన.. బైకు వెనుక ఒకవైపు కూర్చుని వస్తుండగా, ఉన్నట్లుండి కిందపడ్డారు. తలకు తీవ్రగాయమైంది. అక్కడే ఉన్న ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. నిమిషాల వ్యవధిలోనే ఆయన మృతి చెందారు. గురుస్వామి స్వస్థలం కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీ పేట. ప్రస్తుతం ఏర్పేడు లో స్థిరపడ్డారు. రెండున్నరేళ్ల కిందట శ్రీకాళహస్తి నుంచి వడమాలపేటకు బదిలీపై వచ్చారు. ఈయనకు ఇద్దరు కుమారులున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాక.. స్వగ్రామానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు.

సింగిల్ విండోల్లో కంప్యూటరీకరణ వేగవంతం : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 75 సింగిల్ విండోల్లో కంప్యూటరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని డీసీసీబీ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి, జేసీవిద్యాధరి చెప్పారు. బ్యాంకు ఆవరణంలో బుధవారం సాయంత్రం బ్యాంకు సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన జేసీ మాట్లాడుతూ ఇప్పటివరకు 27 విండోలలో కంప్యూటీకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన 48 విండోలలో ఈ ప్రక్రియను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తిరుపతి డీఎల్‌సీవో రవిబాబు మాట్లాడుతూ బ్యాంకు బ్రాంచీల్లో లాగా విండోల ద్వారా కూడా అన్ని రకాల రుణాలు ఇవ్వాలని కోరారు. చిత్తూరు డీఎల్‌సీవో వనజ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్‌కు శాశ్వత భవనంకోసం ఎకరం భూమిని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈవో శంకర్‌బాబు బ్యాంకు ప్రగతిని వివరించారు.డీసీవో నాగవర్ధన, డీసీఏవో బ్రహ్మానందరెడ్డి, జీఎం మనోహర్‌గౌడ్, లిల్లీ క్యాథరిన్, డీజీఎం చలపతి, ఏజీఎం సురేష్‌బాబు, పర్సన్ ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఖరీఫ్‌కు కార్యాచరణ ప్రణాళిక

- సిద్ధం చేయమన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయ, ఉద్యానశాఖలు ఖరీఫ్ 2025 కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు అధికంగా వరి, చెరకు, మామిడి వంటి పంటలపై ఆధారపడి ఒకే రకమైన పంటలను పండిస్తున్నారని, దీంతో దిగుబడి తగ్గి నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు, పంట మార్పిడి విధానం, నాణ్యమైన విత్తనాల సరఫరా తదితర అంశాలపై గ్రామస్థాయిలో మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రస్తుత ఏడాది 37,861 మంది రైతులచే 41,127 ఎకరాల ప్రకృతి వ్యవసాయ సాగు సాధించామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను నాణ్యమైన విత్తన కొనుగోలు, యాంత్రీకరణ, బిందు, తుంపర్ల సేద్యం విధానాల ద్వారా మెరుగైన ఫలితాలను సాధించాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్‌లో మరో విద్యార్థి డీబార్

చిత్తూరు సెంట్రల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో మరో విద్యార్థి డీబార్ అయ్యారు. దీంతో విద్యార్థుల డీబార్ సంఖ్య నాలుగుకు చేరింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 50 సెంటర్లలో ద్వితీయ ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షలు నిర్వహించారు.సోమల ఎస్‌కేవీఎస్ జూనియర్ కళాశాలలో మర్శిమాను ఉస్మాను మాల్ ప్రాక్టీస్ కింద డీబార్ చేసినట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. కాగా జిల్లా వ్యాప్తంగా 15 సెంటర్లలో నిర్వహించిన ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లో 1226 మంది విద్యార్థులకు గాను 896 మంది హాజరు కాగా, 330 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు 10 కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు.

రైతుల ఈ కేవైసీలో జిల్లాకు మొదటి స్థానం

చిత్తూరు సెంట్రల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు ఈకేవైసీలో రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచినట్లు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. 2024-25 రబీ సీజన్‌లో 22,793 ఎకరాల్లో 18,462 మంది రైతులు సాగు చేయగా, ఇప్పటి వరకు 21,373 ఎకరాల్లో 17,372 మంది రైతుల ఈకేవైసీ చేయడంతో 94 శాతంతో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మిగిలిన మొత్తాన్ని సైతం త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి -9703618706, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె -9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, SHAIK MOHAMMAD FAZXULUNNISA, residing at D.No. 3-96-12/1, NTR Colony, N.S Peta, Punganur Town & Mandal, Chittoor District - 517247, Andhra Pradesh, hereby declare that I have changed my name from SHAIK MOHAMMAD FAZXULUNNISA (Old Name) to S FAZLUNNISA BEGUM (New Name). Henceforth, I shall be known as S FAZLUNNISA BEGUM for all purposes,
AJT - 215891

CHANGE OF NAME

I, DIGUMURTHY BHASKARA NAIDU (Old Name) R/o: DIGUMUTHIVARIPALLI,BODEVANDLAPALLI,YV PALEM,TIRUPATI Dt.A.P. Do here by declared I have changed my name as DIGUMURTHI BHASKAR NAIDU (New Name) S/o DIGUMURTHI CHENGAMA NAIDU.
AJT - 5126

CHANGE OF NAME

I, BAHADUR LALITHA TAKE (Old Name) S/o Bahadur Lalitha Bahadur R/o. 3-103, Allimitta, Annasami Palle,Venkatapuram ,Renigunta,Tirupati Dt. AP-517520. I have changed my Surname to LALITHA TAKE BAHADUR (New Name) S/o Bahadur Lalitha Bahadur. Henceforth I will be known as LALITHA TAKE BAHADUR (New Name)
AJT - 5128

తుడా అప్రూవల్ ప్లాట్స్

తిరుపతి టు చెన్నై హైవే 6 లైన్స్‌కి అతి దగ్గరలో తుడా ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్రదించగలరు. 93963 29505
AJT - 200772

PLOT FOR SALE

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్ వెనుక, తిమ్మినాయుడు పాళ్యం నందు సైజు 50x58 నార్త్ ఈస్ట్ కార్నర్ 81 అంకణముల ప్లాట్ అమ్మబడును. సంప్ర. : 9177067141
AJT - 5109

PLOTS FOR SALE

42 నెలల సులభ వాయిదా పద్ధతిలో ప్లాట్లు అమ్మకానికి కలవు, 0% వడ్డీ, తిరుపతి IIT & IISER కి సమీపంలో స్పాట్ రిజిస్ట్రేషన్ సంప్ర: 90006 37999, 88015 01376.
AJT - 5097

CHANGE OF NAME

I, Nagena Begum Shaik D/o Late SK Khasim (Old Name) Residing at D.No 19-45-S3-47, Hathiramji Colony, Bairagipatteda, Tirupati urban mandal, Tirupati dt, A.P. I have changed my name to SHAIK NAGEENA BEGUM D/o Late SHAIK KHASIM (New Name)
AJT - 5125

CHANGE OF NAME

I, DIGUMURTHY PADMAVATHI (Old Name) R/o: DIGUMUTHIVARIPALLI,BODEVANDLAPALLI,YV PALEM,TIRUPATI Dt.A.P. Do here by declared I have changed my name as DIGUMURTHI PADMAVATHI (New Name) W/o DIGUMURTHI BHASKAR NAIDU.
AJT - 5127

WANTED

Wanted Teachers for Primary, Higher classes. All subjecs Inter & Degree Candidates also. Salary 10K_15K. Mangalam, Tirupati. Cont. : 93960 81695
AJT - 200763

WANTED

ఆటో డ్రైవర్ కావలెను. డ్యూటీ టైమ్ 6.00 AM to 6.00 P.M. జీతం : 15,000/-. సోము రెంట్ మెటీరియల్స్, తిరుపతి. సెల్ : 97053 61277
AJT - 5110

WANTED

Wanted Tele Callers, Office Managers, Marketing Officers, Salary 12K-25K PM + Incentives, RKC Group:9000637999, 8801501376
AJT - 5096

WANTED

మీరు 10th క్లాస్ పాస్ అయి వున్నారా! అయితే LIC భీమాసఖీ (జీతం + కమీషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell : 90599 19948
AJT - 5124

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(ట్రైజర్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 226978

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పలమనేరు

కుప్పం/పుంగనూరు

పెద్దకాలువ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



స్వచ్ఛ కుప్పంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ కుప్పం లక్ష్యసాధనలో భాగంగా కుప్పంలోని పెద్దకాలువ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డులో పర్యటించి ప్రజలకు స్వచ్ఛ కుప్పంపై అవగాహన కల్పించారు. ఎవరూ పెద్దకాలువలో చెత్త వేయరాదని ఆయన సూచించారు. ప్రజలందరూ పురపాలక సంఘం నుంచి వచ్చే వాహనాల్లోనే చెత్తను వేసి, స్వచ్ఛ కుప్పం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

రామకుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని సీఎం చంద్రబాబు పీఏ మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను క్రమం తప్పకుండా సకాలంలో అందించిందని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి పేర్లను విద్యా, వసతిదీవెనలుగా మార్చి కాలేజీలకు నేరుగా ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను చెల్లించకుండా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసి విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అంతేకాకుండా ఫీజ్ రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకుండా వేధించిందని తెలిపారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో బుధవారం వైసీపీ కార్యాలయం వద్ద వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి వైసీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరభ్యంతర భూముల క్రమబద్ధీకరణ

పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నిర్మించుకొన్న ఇళ్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని పలమనేరు ఆర్డీవో భవాని బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇందుకోసం ఒక ప్రత్యేక జీవోను ఇచ్చిందని తెలిపారు. 2019 అక్టోబర్ 15 నాటికి నిర్మించుకొన్న అన్ని ఇళ్లకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. 150 గజాల మేరకు ఆక్రమించుకొన్న ఇళ్లకు పూర్తి ఉచితంగా ఇంటి పట్టా, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ జారీ చేస్తామని.. 150 గజాల నుంచి 300 గజాల వరకు జీఓ ఇచ్చిన నాటి నుంచి ప్రాథమిక ధర 15 శాతం చెల్లించు షరతుతో బీపీఎల్ కుటుంబాలకు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజుతో చేయబడుతుందన్నారు. ఏపీఎల్ కుటుంబాలకు ప్రాథమిక ధరలో 15 శాతంతో పాటు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజుతో చేస్తామన్నారు. 301 గజాల నుంచి 450 గజాల వరకు 100 శాతం ప్రాథమిక ధర చెల్లించు షరతుతో 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజుతో బీపీఎల్ కుటుంబాలకు రిజిస్ట్రేషన్ చేయబడుతుందన్నారు. ఏపీఎల్ కుటుంబాలకు ప్రాథమిక ధర 200 శాతం ప్రాథమిక ధర చెల్లించు షరతుతో పూర్తి రిజిస్ట్రేషన్ చేయబడుతుందని తెలిపారు. అలాగే 451 గజాల పైన ఉన్న ప్రాథమిక ధరకు 5 రెట్లు చెల్లించు షరతుతో పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజుతో చేయబడుతుందన్నారు. బీపీఎల్, ఏపీఎల్ కుటుంబాలకు ఈ షరతు వర్తిస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమ్మరి యల్లప్పకు సన్మానం



హైదరాబాద్‌లో సన్మానం అందుకున్న కళాకారుడు కుమ్మరి యల్లప్ప

పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళాక్షేత్రంలో మొల్లమాంబ జయంతి సందర్భంగా రాష్ట్ర శాలివాహన ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజాపతి ఇటికల వీరయ్య చేతుల మీదుగా టెర్రకోట చేతి వృత్తి కళాకారుడుగా ప్రతిభ కనబరచినందున పలమనేరుకు చెందిన యల్లప్పను ఘనంగా సన్మానించారు. బంకమట్టితో కళారూపాలను తయారు చేయడంతో పాటు 250 మందికి కళారూపాల తయారీలో యల్లప్ప శిక్షణ ఇచ్చారు. యల్లప్పకు హైదరాబాద్‌లో ఘనంగా సన్మానం జరగడంపై ఇక్కడి టెర్రకోట కళాకారుల సంఘ అధ్యక్షులు రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

కల్లూరు వారపుసంత వేలం ఆదాయం రూ.8.29 లక్షలు



కల్లూరు వారపుసంతకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ పరిధిలోని దిన, వారపు సంత, ప్రైవేటు బస్టాండు, షాపింగ్ గదులకు నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.8,29,400 ఆదాయం లభించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, సర్పంచ్ షకూర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం సర్పంచ్ షకూర్ అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహించారు. రెండు షాపింగ్ గదుల వేలం వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రితో నక్కపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మొరం పంచాయతీ నక్కపల్లి ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి పరీక్ష సామగ్రి అందించారు. బుధవారం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వెంకటమునిరెడ్డి పరీక్ష ప్యాడ్లు, స్కేలు, పెన్నులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, చైర్మన్ వెంకటరత్న, కవీంద్రనాయుడు, అరుణ్, అనిల్, దేవేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహనిర్మాణాలు

కుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని అర్హులందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తుందని కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకున్న వారి వివరాల డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపామని పేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, 2025-2026 సంవత్సరానికి సంబంధించి డీపీఆర్‌ను తిరిగి పంపుతామన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు



రొంపిచెర్లలో సమస్యలు తెలుసుకుంటున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరగాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్లలో ని ఆయన స్వగృహానికి సదుం, పులిచెర్ల మండల నాయకులు చేరుకుని గ్రామాల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంనే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏం జరిగిందో పక్కన పెట్టి అర్హులైన ప్రజలకు సముచిత న్యాయం జరిగేలా పనిచేయాలని.. ప్రజా సమస్యలకు అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. అనంతరం సోమల నాయకులు ఆవులపల్లెలో జరిగే వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలి

పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని పన్ను బకాయి దారులు వెంటనే పన్ను బకాయిలు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తిపన్ను , ఖాళీ స్థల పన్నులపై అపరాధ రుసుం రద్దు చేసే అవకాశాలు లేవన్నారు. పలమనేరులో నేటికి 2,998 మంది ఆస్తిపన్ను రూ.1,36,31,378, నీటిపన్ను 2,521 మంది రూ.62,16,312 చెల్లించాల్సి ఉందన్నారు. ఖాళీస్థల పన్నులు 405 మంది రూ. 48,33,679 చెల్లించాలని తెలిపారు. బకాయిదారులు వెంటనే సంబంధిత సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లలో చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సెలవు రోజుల్లోనూ మున్సిపల్ కార్యాలయంలో పన్నులు కట్టించుకుంటారని.. క్యాష్‌కౌంటర్ సిబ్బంది పనిచేస్తారని తెలిపారు.

నేడు ఆలయాల హుండీ లెక్కింపు

పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న పలమనేరులోని సత్యగంగమ్మగుడి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో హుండీలను 13న గురువారం లెక్కించనున్నట్లు ఆలయాల కార్యనిర్వహణ అధికారి కమలాకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సత్యగంగమ్మ గుడి హుండీని, మధ్యాహ్నం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ హుండీని లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

పలమనేరు కోర్టులో రూ.కోటికి ఐపీ

పలమనేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ పలమనేరు కోర్టులో రూ.1.02 కోట్లకు ఐపీ దాఖలు చేశారు. వి.కోటలో పలు వ్యాపారాలు చేసిన లక్ష్మీనారాయణ వ్యాపారాల కోసం తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగాయి. 16 మంది వద్ద తీసుకున్న అప్పులు, వడ్డీలు చెల్లించలేక రూ.1.02 కోట్లు చెల్లించలేక పలమనేరులో న్యాయవాది కవితారాణితో సంప్రదించి కోర్టులో ఐపీ దాఖలు చేసుకున్నారు.

రైతులకు స్మార్ట్ వినియోగంపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం స్మార్ట్ వినియోగం, ఉపయోగాలపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మానిటరింగ్ అధికారి ఏడీఏ కె.శివప్రసాద్ మాట్లాడుతూ మార్కెటింగ్ ధరలు, వాతావరణం, యాప్‌లో వ్యవసాయ పంట వివరాల సమాచారం ఆప్‌ల గురించి వివరించారు. ఏవో సుధారాణి, శిక్షకులు చంద్రశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏపీఎంఏ కుప్పం సమితి అధ్యక్షుడిగా అబ్దుల్‌తస్లీం



కార్యవర్గానికి ఎన్నికైన వారితో తస్లీమ్

రామకుప్పం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ కుప్పం సమితి అధ్యక్షుడిగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రామకుప్పం ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్‌తస్లీం తెలిపారు. బుధవారం కుప్పంలోని మండల సచివాలయంలో జరిగిన ఎన్నికల్లో తనతోపాటు ఉపాధ్యక్షుడిగా నంజుండరావు, కార్యదర్శులుగా బాలకృష్ణ, శేషాద్రి, కోశాధికారిగా లక్ష్మీప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా అజంతుల్లా, మహ్మద్‌గౌస్‌లు ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

పోడుచేన్లలో తాగునీటి బోర్ల ఏర్పాటు



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోడుచేన్లు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వారం రోజుల క్రితం గ్రామస్తులు ఎంపీడీవో కుమార్‌కు విన్నవించారు. స్పందించిన ఎంపీడీవో గ్రామంలో పర్యటించి వారంలో కొత్త బోరును ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. బుధవారం పోడుచేన్లలో బోరు మోటారును ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎంపీడీవోకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరిముత్తనపల్లెలో..

శాంతిపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ముత్తనపల్లె గ్రామంలో పారిశుధ్య పనులను బుధవారం ఎంపీడీవో కుమార్ పరిశీలించారు. సిద్దేశ్వరస్వామి జాతర ఉన్నందున పారిశుధ్య పనులు వేగంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఆవరణలో పారిశుధ్య పనులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారి దివ్యతేజం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు,



శేషవాహనంపై విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి సూర్యప్రభవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకగా ఏర్పాటు చేసిన పుష్పపల్లకిలో ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరించారు. బ్రహ్మణ వీధి, బజారువీధి, తేరువీధి, జమీందార్ల ప్యాలెస్ మీదుగా ఊరేగించారు. భక్తులు స్వామి వారికి మంగళహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం చంద్రప్రభవాహనంపై స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శేషవాహనంపై లక్ష్మీనరసింహుడి విహారం

కల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు దేవళంపేటలో భక్తులపాలిట కొంగు బంగారంగా కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం శేషవాహనంపై లక్ష్మీ నరసింహస్వామి నాలుగుమాడ వీధుల్లో విహరించారు. ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శేషవాహనంపై స్వామివారు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కర్పూర హారతులిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కల్లూరు ఆర్యవైశ్య సంఘం శేషవాహనం ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గోవింద నామస్మరణలతో రథోత్సవం



సోమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భక్తుల గోవింద నామస్మరణలతో రథోత్సవం వైభవంగా జరిగింది. వాల్మీకి సంఘ భక్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. పురవీధుల్లో రంగునీళ్లు చల్లుకుంటూ రథాన్ని లాగారు. రథోత్సవం ఎదుట చెక్కభజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల నుంచి ఉభయదారులు పాల్గొన్నారు. ఇబ్బందులు లేకుండా టీటీడీ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యువత పోరు నిర్వహించడం హాస్యాస్పదం



మాట్లాడుతున్న తెలుగు యువత నేతలు

రామకుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తమ ప్రభుత్వ హయాంలో మోసానికి పాల్పడి ప్రస్తుతం ఫీజు పోరు నిర్వహించడం హాస్యాస్పదమని తెలుగు యువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. బుధవారం రామకుప్పంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు యువత భవిష్యత్తును దెబ్బతీసిందన్నారు. గత ఐదేళ్లలో గుర్తుకు రాని ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు జగన్‌రెడ్డికి ఇప్పుడు గుర్తొచ్చాయా అని ప్రశ్నించారు. విద్యార్థులకు రూ.4,271 కోట్లు ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌ల బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం బకాయిపడ్డ ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను చెల్లించేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. అలాగే 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లకు నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా రాష్ట్ర ప్రజలు ఇక వైసీపీని ఎప్పుడూ నమ్మరని తెలిపారు.

పదిలో ప్రతిభ చూపితే ఉచితంగా ఇంటర్ విద్య



విద్యార్థులకు ఫైళ్లు అందజేస్తున్న నేతలు

రామకుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రామకుప్పం, శాంతిపురం, వి.కోట మండలాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యనందిస్తామని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామకుప్పం మండలంలోని ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నలంద విద్యా సంస్థల యాజమాన్యం డాక్యుమెంటు ఫైళ్లను వితరణగా అందించింది. పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, విద్యా సంస్థల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డిలు వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. గత ఏడాది పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. ప్రధానోపాధ్యాయులు, నిర్వహణ కమిటీల చైర్మన్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్రామయ్య

కల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలని.. పదో తరగతి పరీక్షలు విద్యార్థి జీవితానికి తొలి మెట్టులాంటిదని తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రాసాని వెంకట్రామయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పుట్టిన ఊరికి, చదువుకున్న పాఠశాలకు విద్యార్థులు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని గూడూరుపల్లె ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం మహేష్ నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని గూడూరుపల్లె, బండ్లపల్లె, ఈడిగపల్లె పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్ఎంలు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయాల్లో ప్రశ్నపత్రాలను పూర్తిగా చదివిన తర్వాత జవాబు పత్రాలను రావాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఇంటి ఎదుట పోరు నిరసన చేపట్టాలి



మాట్లాడుతున్న రమేష్

పుంగనూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎం జగన్ ఇంటి ముందు పోరు నిరసన చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంటు, వసతిదీవెన తదితర పథకాలకు చెల్లించకుండా బకాయి పెట్టి ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయాల వద్ద పోరు నిరసన కార్యక్రమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ పరిపాలన కాలంలో చెల్లించే ఫీజు రీఎంబర్స్‌మెంటు, వసతి దీవెన పథకాలను పేర్లు మార్చు చేసి కొత్త పథకాల పేర్లతో కోత విధించి మళ్లీ నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, నౌషాద్, ఇమ్రాన్, సామీర్, ఐటీడీపీ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



చౌడేపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పూర్వపు విద్యార్థి సుజన్‌రాజు విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం బయలుదేరిన జనసైనికులు



పిఠాపురానికి బయలుదేరిన జనసైనికులు

గుడుపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనసేన పార్టీకి చెందిన జనసైనికులు ఆ పార్టీ మండలాధ్యక్షుడు అమీర్ ఆధ్వర్యంలోని పిఠాపురంలో ఈ నెల 14న జరుగనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు బుధవారం బయలుదేరి వెళ్లారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బస్టాండు వరకు వెళ్లి పిఠాపురానికి బయలుదేరారు. కార్యక్రమంలో హంసగిరి, మణికంఠ, ఆనంద్, నాగరాజు, రామచంద్ర, వామనమూర్తి, విజయ్, మురళీ, వినయ్, ప్రభు, మహేష్, రాజేష్, గణేష్, బాబు, సుబ్బు, రాజు, రమేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో 'ఉపాధి'లో అవకతవకలు

● రూ.1.24లక్షలు రికవరీ



కుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో 2023-2024 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. చేపట్టిన పనుల్లో అవకతవకలు, లక్ష్య సాధనలో వెనుక బడిన క్షేత్ర సహాయకుల నుంచి రూ.1.24లక్షలు జరిమానాలు, రికవరీలు చేశారు. అవకతవకలకు సంబంధించి రూ.74,922, లక్ష్యసాధనలో వెనుకబడిన వారి నుంచి రూ.49వేలు రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, ఉపాధి హామీ ఏపీడీ వెంకటరత్నం, ఏపీఓ జ్యోతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



రామకుప్పం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో తప్పకుండా నాణ్యత పాటించాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. బుధవారం రామకుప్పం బాలికోన్నత పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో వంట కార్మికులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం వండి వడ్డించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, సుబ్రీ పాల్గొన్నారు.

చిన్నగొర్నిగుంటలో పారిశుధ్య పనులు



చౌడేపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాగునీటిలో మురుగు నీరు కలుషితం కాకుండా టీడీపీ నాయకులు బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మండలంలోని కాటిపేరి పంచాయతీ చిన్నగొర్నిగుంటలో తాగునీటి కోసం మురుగు కాలువ పక్కనే పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే గత కొంతకాలంగా పంచాయతీ అధికారులు మురుగు కాలువలో పారిశుధ్య పనులు చేపట్టకపోవటంతో మురుగుకాలువలోనే తాగునీటి పైపు ఉండటంతో తాగునీరు కలుషితమవుతోంది. గుర్తించిన టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మురుగు కాలువలు శుభ్రం చేయించారు.

పేదలకు అండగా
న్యాయసేవాధికార సంస్థ సేవలు

● జిల్లా లీగల్ సెల్ సెక్రటరి భారతి



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ సెక్రటరి భారతి

యాదమరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఉచిత న్యాయసేవాధికారి సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సెల్ సెక్రటరి భారతి పిలుపునిచ్చారు. మండలపరిధిలోని డి.కె.చెరువు గ్రామంలో బుధవారం న్యాయసేవాధికార సంస్థ అందించే సేవలపై అధికారులతో కలిసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజల్లో చైతన్యం కల్పించి రాజ్యాంగంలో మహిళల రక్షణకు ప్రత్యేకంగా చట్టాలు అమలుచేయడం, నిస్సహాయ మహిళలకు, పనిచేసేచోట, కళాశాలలో, వివక్షకు గురైన, గృహహింస, వరకట్న వేధింపులకు గురైన మహిళలకు జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయసేవాధికార సంస్థ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఏఎస్ఐ ఉమాపతిరెడ్డి, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

పరిశోధనల్లోనూ మహిళల ముందడుగు



'సైన్స్‌లో మహిళలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నగరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లోనూ మహిళలు ముందడుగు వేస్తున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం సైన్స్‌లో మహిళలు అనే సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు, వారు ఎదుర్కొంటున్న అడ్డంకుల గురించి వివరించారు. అతిథులుగా విచ్చేసిన ముగ్గురు రీసోర్స్ పర్సన్లు డాక్టర్ ఎం.తులసి.. అల్జీమర్స్ వ్యాధిపై, డాక్టర్ సుశీల.. మూర్ఛ వ్యాధిపై, డాక్టర్ ఏ.సుజల.. స్వప్నస్మిత నానో పార్టికల్స్‌పై సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా సైన్స్‌లో మహిళలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

థామస్‌పై అసత్యాలు తగవు: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

పెనుమూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్‌పై కొంత మంది వైసీపీ నాయకులు కొన్ని సోషల్ మీడియాలో అసత్య కథనాలు, ఆరోపణలు చేయడం తగదని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, జిల్లా కార్యదర్శి జీకే చౌదరి అన్నారు. బుధవారం వారు పెనుమూరు బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజకీయాల్లోకి వచ్చి తక్కువ సమయంలోనే పరిణితి చెందిన నాయకుడిలా అసెంబ్లీలో నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును నియోజకవర్గానికి తీసుకొచ్చి సుమారు రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. థామస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు పనికట్టుకుని బురద చల్లుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షురాలు ఉషారాణి, ప్రధానకార్యదర్శి పరంధామ, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల అధ్యక్షులు అశోక్‌రెడ్డి, జ్యోతీశ్వర్, పెనుమూరు మాజీ అధ్యక్షుడు వాసుదేవ నాయుడు, మండల కార్యదర్శి గిరి నాయుడు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో
ద్విచక్ర వాహనం చోరీ



చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎదుట నిలిపిన బయట వ్యక్తుల వాహనాలు

చిత్తూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని టీబీ నివారణ శాఖకు చెందిన ద్విచక్ర వాహనం బుధవారం చోరీకి గురైందని ఆ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం కార్యాలయం ముందు ఉంచిన వాహనం సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు వెతికితే కనపడలేదని తెలిపారు. ఆస్పత్రికి వచ్చేవారే కాకుండా కొంత మంది చేపల మార్కెట్ వాళ్లు, విద్యార్థులు, ఆటోవారు, బయట వ్యక్తులు కూడా ఆస్పత్రిలో వారి వాహనాలను పార్క్ చేసి వెళ్లిపోతున్నారని సిబ్బంది వాపోతున్నారు. ఆస్పత్రి సెక్యూరిటీ సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పార్కింగ్ నిర్వహణకు ఓ సెక్యూరిటీని నియమించాలని పలువురు కోరుతున్నారు. వైద్యుల వాహనాలు, అత్యవసర వాహనాలు నిలిపేందుకు కూడా స్థలం లేకుండా బయట వాహనాలను పార్క్ చేసి వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించండి

ఐరాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు పని ఒత్తిడి తగ్గించాలని ఐరాల మండలంలోని కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో ధనలక్ష్మికి ఆమె కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు ఎంపీడీవోతో మాట్లాడుతూ వివిధ రకాల సచివాలయ సర్వేలు, గ్రామ పంచాయతీకి సంబంధించిన పనుల టార్గెట్‌తో తీవ్ర ఒత్తిడికి గురౌతున్నట్లు తెలిపారు. స్పందించిన ఎంపీడీవో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్యదర్శులకు ఒత్తిడి తగ్గించడానికి కృషి చేస్తానన్నారు. మండలంలో పని చేస్తున్న కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్‌గా హేమశ్రీ



వెదురుకుప్పం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా డాక్టర్ హేమశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కార్వేటినగరం మండలం కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వచ్చి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ ఉన్నత విద్య కోసం సెలవుపై వెళ్లారు.

పని ప్రదేశాల్లో ఇబ్బందులపై
మహిళా సంక్షేమ కమిటీ ఏర్పాటు

చిత్తూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేధింపుల నిషేధం, నియంత్రణ, పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పని వేళల్లో మహిళలపై వేధింపులు, ఇతర సమస్యలను నివారించడం కోసం మహిళా అధికారులు, ఎన్‌జీవో, మహిళా న్యాయవాదితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఏసీపీ శుభప్రద ప్రిసైడింగ్ అధికారిగా, డీఈఈ శ్రావణి కన్వీనర్‌గా, సీనియర్ అసిస్టెంట్ తనూజ, ఎన్‌జీవో నుంచి శోభారాణి, న్యాయవాది నిషితలు సభ్యులుగా ఉంటారన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, పలువురు ఉద్యోగినులుపాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన వైవీ రాజేశ్వరి



చిత్తూరు సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి విజయవాడలోని నారా లోకేష్ కార్యాలయంలో కలసి స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించానని పేర్కొన్నారు. పార్టీకోసం సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నానని, తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరినట్లు ఆమె తెలిపారు.

వరసిద్ధుడి సేవలో కంభం పాటి



ఐరాల(కాణిపాకం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రామ్మోహన్‌రావు దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గాలి జగదీష్‌కు శుభాకాంక్షలు

విజయపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు తనయుడు గాలి జగదీష్‌కు పుట్టిన రోజు సందర్భంగా బుధవారం జగదీష్ యువసేన నేత శ్రీరామ్ చరణ్ తిరుపతిలో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అభిమానులు మోహన్ నాయుడు, శివకుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవాలకు ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు పొన్నియమ్మ, 18 నుంచి 20వ తేదీ వరకు షిరిడీ సాయి బాబా ఆలయాలకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక కార్యక్రమాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులను ఆలయ ట్రస్టీ సి.కె.లావణ్యబాబు ఆహ్వానించారు. ఆమె బుధవారం కలెక్టరేట్‌లో వారిని కలిసి ఆలయ సంప్రదాయంతో పత్రికలను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాకులు, ఆలయాల అర్చకులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి

శ్రీరంగరాజపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మంగుంట గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం, బలిహరణం, ప్రధాన హోమం నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు వెంకటాచాలపతి, ఎగువ మంగుంట, దిగువ మంగుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

భూమి లీజు పొడిగింపు

యాదమరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో భూమి లీజు పొడిగింపునకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జంగాలపల్లి రెవెన్యూ పంచాయతీ పరిధిలోని గాబ్రియెల్ పాఠశాలకు గతంలో సర్వే నెంబర్ 356/1లో 4.64 ఎకరాల భూమిని లీజుకు కేటాయించింది. కాగా లీజు గడువు ముగిసిన నేపథ్యంలో మరో 18 నెలల పాటు లీజు పొడిగింపునకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

హైరోడ్డు విస్తరణ పనులకు భూమి పూజ

చిత్తూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు హైరోడ్డు విస్తరణలో భాగంగా కోర్టు సముదాయం కోల్పోనున్న స్థలాన్ని నగరపాలక సంస్థ అధికారులు మార్కింగ్ చేశారు. హైకోర్టు సూచనల మేరకు రోడ్డు విస్తరణకు జిల్లా న్యాయమూర్తి సమ్మతం తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో ప్రహరీగోడ నిర్మాణానికి నగరపాలక అధికారులు బుధవారం భూమిపూజ చేశారు. 900 అడుగుల పొడవున ఉన్న 25 సెంట్ల స్థలాన్ని రోడ్డు వెడల్పుకు ఇచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, కమిషనర్ నరసింహప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కవయిత్రి మొల్ల జయంతి

చిత్తూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కవయిత్రి అటుకూరి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా జిల్లా స్థాయిలో ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని పాతగ్రీవెన్స్ హాలులో ఆమె చిత్రపటానికి అంజలి ఘటించే కార్యక్రమం జరుగుతుందన్నారు.

తిరిగి మళ్లీ వచ్చిన ఏనుగు

● భయాందోళనలో ప్రజలు
● తమిళనాడుకు మళ్లించడానికి ప్రయత్నిస్తున్న అటవీ అధికారులు



ఏనుగును మళ్లించే పనిలో ఫారెస్టు అధికారులు

గుడిపాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దుల్లో నుంచి మండలంలోకి బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు తిరిగి రావడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం అటవీశాఖ అధికారులు టపాసులు పేల్చి తమిళనాడు వైపుకు మళ్లించారు. దీంతో సమస్య పరిష్కారమైందనుకునేలోపే తిరిగి రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పల్లూరు, పానాటూరు అటవీ ప్రాంతంలో అదే ఒంటరి ఏనుగు హల్‌చల్ చేయడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న రేంజ్ ఆఫీసర్ థామస్, డిప్యూటీ రేంజ్ అధికారి ఆనంద్‌రెడ్డి, సిబ్బందితో కలిసి తమిళనాడు వైపు మళ్లించడానికి చర్యలు చేపడుతున్నారు. వారు మాట్లాడుతూ రైతుల పొలాల వద్దకు రావద్దని చెప్పారు.

విద్యార్థుల్లో నైపుణ్యత పెంచాలి

● ఏపీసీ వెంకటరమణ



పి.గొల్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ క్లస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చదువులో విద్యార్థుల నైపుణ్యం పెంచాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ సూచించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 2466 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను 148 క్లస్టర్లుగా విభజించి, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు నిర్వహించిన సమావేశాల్లో విద్యార్థుల అభ్యసనా అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరానికి చివరి సమావేశం కావడంతో వచ్చే విద్యా సంవత్సరానికి బోధన ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి సారించారు. యాదమరి మండలం పి.గొల్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ సీఆర్‌సీతో పాటు ఇతర మండలాల్లోని సమావేశాలకు హాజరైన ఏపీసీ ఇప్పటికే ఉపాధ్యాయులకు ఇచ్చిన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతుల పురోగతిపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఒకటి, రెండు తరగతుల ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎం ద్వారా శిక్షణ ఇవ్వగా, తరల్ ద్వారా 3,4,5 తరగతులకు ఉపాధ్యాయులకు లీడర్‌షిప్ ట్రైనింగ్ కింద పాఠశాలల హెచ్‌ఎంలకు ఇచ్చిన ట్రైనింగ్‌లు, వాటి అమలు తీరుపై సమీక్షించారు. వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ఉత్తీర్ణత శాతం పెంచవచ్చునన్నారు. పాఠశాలల్లోని ఇంటర్‌నెట్, ట్యాబ్‌లు, పనితీరుపై సమీక్ష, సౌకర్యాలు, పాఠశాలల్లో టీచర్ల కొరత అంశాలను ప్రధానంగా సమీక్షించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న ఏనుగుల దాడులు



దళవాయిపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

యాదమరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో గత వారం రోజులుగా 14 ఏనుగులు, 5 గున్నలు పంట పొలాలపై దాడులు చేసి నాశ నం చేస్తున్నాయి. దీంతో దళవాయిపల్లె, మాదిరెడ్డిపల్లె, భూమిరెడ్డిపల్లె గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దళవాయిపల్లె సమీపంలోని వరి, అరటి, చెరకు పంటలను ధ్వంసం చేశాయని బాధిత రైతు శీనుమండడి తెలిపారు. ధ్వంసం చేసిన పంటలను ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది బుధవారం పరిశీలించారు. దళవాయిపల్లె సమీపంలోని నుంజర్ల ప్రాజెక్టులో మాటువేసిన గుంపును నిత్యం ట్రాకర్లతో పర్యవేక్షిస్తూ పంట పొలాలపై దాడి చేయకుండా అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు. ఏనుగుల దాడుల నివారణకు ట్రెంచ్‌లు, సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసి పరిహారాన్ని చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యతో ఉన్నత శిఖరాలు



సూచనలిస్తున్న అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ పంకజ

వెదురుకుప్పం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అకడమిక్ అడ్వైజర్లు డాక్టర్ పంకజ, డాక్టర్ శంకరరావు తెలిపారు. బుధవారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్ మీటింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీత విజయులురెడ్డి, ఎన్ఎస్ఎస్‌పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీకి ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇప్పుడు గుర్తొచ్చిందా..?

● తెలుగు యువత ప్రశ్న



కాజూరు రాజేష్

చిత్తూరు సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డికి అధికారంలో ఉన్న ఐదేళ్ళు గుర్తుకురాని ఫీజు రీఎంబర్స్‌మెంటు ఇప్పుడు గుర్తొచ్చిందా అని తెలుగుయువత చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు కాజూరు రాజేష్ ప్రశ్నించారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ 'యువత పోరు' అనే కార్యక్రమానికి పిలుపునివ్వడం హాస్యాస్పదంగా వుందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను విద్యా దీవెనగా పేరుమార్చి తామేదో కొత్తగా పథకాన్ని సృష్టించినట్లు జగన్ రెడ్డి ప్రచారం చేసుకున్నారన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ వేస్తే, జగన్ రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మంది విద్యార్థులకు... అది కూడా విడతల వారీగా ఇచ్చి దాదాపు 7 లక్షల మంది విద్యార్థులను మోసగించారని ఆరోపించారు.జగన్ రెడ్డి నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు.

ట్రాఫిక్, అక్రమ వ్యాపారాల నియంత్రణకు
ప్రత్యేక ప్రణాళిక: డీఎస్పీ



ట్రాఫిక్‌పై సూచనలిస్తున్న డీఎస్పీ, సీఐలు

నగరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్, అక్రమ వ్యాపారాల నియంత్రణకు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రణాళికకు నగరి డీఎస్పీ అజీజ్, సీఐ విక్రమ్ శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు, వేగ నియంత్రణ కోసం బుధవారం ప్రజల సహకారంతో పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఆఫీసు, స్టేట్‌బ్యాంకు వద్ద మొబైల్ బారికేడ్లను ఏర్పాటుచేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని టవర్‌క్లాక్ జంక్షన్ నుంచి ఓంశక్తి గుడి వైపుగా వెళ్లే బస్సులు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నాగలాపురం రోడ్డు మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారుల్లో వన్‌సైడ్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సాంకేతికతపైన అవగాహన కల్పించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళలపై జరిగే నేరాలు, సైబర్‌క్రైమ్‌లపై త్వరలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వైఎస్ఆర్ ఆశయ సాధనే లక్ష్యం

వెదురుకుప్పం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ ఆశయ సాధనే లక్ష్యంగా వైసీపీ ఆవిర్భవించిందని జీడీనెల్లూరు నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. బుధవారం వైసీపీ ఆవిర్భావ దిన వేడుకలను కార్వేటినగరంలో ఘనంగా జరుపుకున్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్వేటినగరం మండల వైసీపీ అధ్యక్షుడు శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, కార్యదర్శి చందురాజు, నాయకులు పట్నం ప్రభాకర్‌రెడ్డి, శేషాద్రి, వెంకటేష్, సుందరరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వెదురుకుప్పం మండలం పాతగుంటలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైసీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టె సుబ్రహ్మణ్యం, సర్పంచ్ భువనేశ్వరి, జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

విజయపురం: విజయపురం, పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరంలో వైసీపీ నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు బాబు, సతీష్‌యాదవ్, దిలీప్, శ్రీరాములురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, కుప్పయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: పట్టణంలోని టవర్‌క్లాక్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పట్టణ వైసీపీ అధ్యక్షుడు రమేషరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, విప్ దయానిధి, కౌన్సిలర్ బీడీ భాస్కర్, మునికృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి







బలిజకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న భీమనేని చిట్టిబాబు నాయుడు - కార్వేటినగరంలో సరస్వతి పూజలో దిలీప్‌కుమార్ తదితరులు - వెదురుకుప్పంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

పాలసముద్రం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బలిజకండ్రిగ, వెంగళరాజుకుప్పం జడ్పీ హైస్కూళ్లలో పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎంలు మీనాక్షి, రఘు, చక్రధరరావు, మాజీ హెచ్‌ఎం లింగమూర్తి, టీడీపీ జిల్లా కార్యదర్శి వాసు నాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: క్రమశిక్షణతో పాటు ఉత్తమ ఫలితాలతోనే విద్యార్థులకు, తల్లిదండ్రులకు, విద్యా సంస్థకు కీర్తి ప్రతిష్టలు వస్తాయని లక్ష్మీనరసింహా విద్యా సంస్థల అధినేత ఎ.దిలీప్‌కుమార్ అన్నారు. కార్వేటినగరంలో లక్ష్మీనరసింహా విద్యా సంస్థలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఓంకారం జ్వాల ప్రజ్వలన, సరస్వతీ పూజ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. డైరెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, జి.ధనంజయరెడ్డి, ఎ.పురుషోత్తం, హెచ్‌ఎం ఆర్.మహేశ్వరరాజు, ప్రిన్సిపాల్ కిషోర్, ఏవోఆర్ నరేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరస్వతీ పూజ, ఓంకారం పూజ కార్యక్రమాలు చేశారు. క్రీడాకారుల బహుమతులకు బయాలజీ ఉపాధ్యాయులు ఓంప్రకాష్ వితరణగా రూ.10వేలు అందించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేశవులు అధ్యక్షతన క్రీడల్లో ప్రతిభకనపరిచిన విద్యార్థులకు దాతలు సోమసుందరంపిళ్లై, శైలేంద్ర వితరణతో బహుమతులను అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు, విశ్రాంత ఉద్యోగి సుధాకర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు విజయులు, తిరుమలరాజు, రంజిత్‌కుమార్, సరస్వతి, హరిత, మాల్తి, సుపతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: స్థానిక 75 దొడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర మొదలియార్ సంఘ ఉపాధ్యక్షుడు, మూడో డివిజన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణన్, హెడ్‌మాస్టర్ సోమశేఖర్‌రెడ్డి, ధనరాజ్, జయశంకర్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రం హైస్కూల్ హెచ్‌ఎం రాజేంద్ర నాయుడు, పాఠశాల చైర్మన్ సుధాకర్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు ఓం ముగ్గు వేసి జ్యోతి వెలిగించారు. విద్యార్థులు పాఠశాలకు బీరువాను బహూకరించారు. పూర్వ విద్యార్థి రవిరెడ్డి ఈ ఏడాది ఉత్తమ విద్యార్థులకు రూ.18 వేలు నగదు ఇచ్చారు. సుధాకర్‌రెడ్డి, దేవరాజులు, సూర్యకుమారి, జ్యోతి, కల్పన, రాజేష్ పాల్గొన్నారు.



నరహరిపేటలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఖాతుంబీ, ఢిల్లీబాయి

గుడిపాల: మండలంలోని శ్రీరంగంపల్లి, బొమ్మసముద్రం, నరహరిపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యాకమిటీ చైర్మన్ టి.ఆర్.ఢిల్లీబాయి, హెచ్‌ఎం ఖాతుంబీ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.